ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 9 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.148	215	244
సూర్యాపేట	రూ.165	230	260
నల్లగొండ	రూ.148	215	244

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 23.6

హర హర మహాదేవ



నల్లగొండలో ఛాయా సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హర హర మహాదేవ.. శంభోశంకర అంటూ శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. సూర్యోదయానికి ముందే ఆలయాలకు చేరుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొని ఉపవాస దీక్షలు ఆరంభించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు ఆలయాలకు చేరుకొని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని రుద్రాభిషేకం, లింగాభిషేకాలు, కుంకుమార్చన లు, రుద్రహోమాలు నిర్వహించారు. మూల విరాట్‌కు పాలు, తేనె, నెయ్యి, పంచదార, పెరుగు, పండ్లు వంటి పంచామృతాల తో అభిషేకించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశా రు. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పం డువగా నిర్వహించారు. యాదగిరికొండపైన శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉద యం నుంచి భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలను చేపట్టిన భక్తులు సాయంత్రం వేళ పరమశివుడిని దర్శించుకుని అభిషేకం, అష్టోత్తర పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రివేళ కొండపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

▸▸ శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు ▸▸ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

▸▸ కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం ▸▸ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

7,8

కాంగ్రెస్ టికెట్ రఘువీర్‌కే

- నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జానా తనయుడు
- తొలిజాబితాలో ప్రకటించిన అధిష్ఠానం
- భువనగిరి టిక్కెట్‌కోసం ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం



నల్లగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కాంగ్రెస్ అభ్యర్థుల తొలిజాబితాలో నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డిని అధిష్ఠానం ప్రకటించింది. శుక్రవారం ప్రకటించిన తొలిజాబితాలో రాష్ట్రం నుంచి నాలుగు సీట్లకు అభ్యర్థులను ఖరారు చేయగా, అందులో నల్లగొండ సీటుకు క్లియరెన్స్ ఇవ్వగా, భువనగిరి స్థానానికి ఇంకా అభ్యర్థిని ఎంపిక చేయలేదు. మాజీమంత్రి కుందూరు జానారెడ్డి పెద్ద కుమారుడైన రఘువీర్‌రెడ్డి మొదటిసారి నేరుగా లోక్‌సభ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. జానారెడ్డి చిన్న కుమారుడు జైవీర్‌రెడ్డి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా గెలుపొందగా, తాజాగా రఘువీర్‌రెడ్డి ఎంపీగా పోటీచేస్తుండడంతో జానా తనయులిద్దరూ క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చినట్లయింది. ప్రత్యక్ష ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేస్తున్నప్పటికీ రఘువీర్‌రెడ్డి తన తండ్రి జానారెడ్డి తరఫున ఆయన పోటీచేసిన పలు ఎన్నికల్లో ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా 2009లో నియమితులైన ఆయన ఆ తర్వాత 2014, 2018లలో పీసీసీ సభ్యుడిగా కొనసాగారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియమితులయ్యాక ఆయన కార్యవర్గంలో 2021లో పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. చిన్నవయసులోనే ఎంపీగా పోటీచేసే అవకాశం రఘువీర్‌రెడ్డికి దక్కడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

భువనగిరి టిక్కెట్ కోసం తారస్థాయిలో ప్రయత్నాలు

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం భువనగిరి స్థానంలో అభ్యర్థిని ఇంకా తేల్చలేదు. దీంతో ఇక్కడ టిక్కెట్ ఆశిస్తోన్న నేతలు తమ ప్రయత్నాలు ఉధృతం చేశారు. కోమటిరెడ్డి సోదరులకు పట్టున్న ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ టిక్కెట్‌కోసం కోమటిరెడ్డి కుటుంబం నుంచి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి, డాక్టర్ కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డితో పాటు పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత, పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్, శాసనమండలి మాజీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ టిక్కెట్‌కోసం ప్రయత్నిస్తున్నారు. కీలకమైన నేతలే బరిలో ఉండడంతో ఈ స్థానంలో అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందనే అంశంపై అందరి దృష్టి నెలకొంది. ఈ స్థానంలో బీజేపీ నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు టిక్కెట్ దక్కడంతో కాంగ్రెస్‌లోనూ బీసీ నేతల్లో టిక్కెట్ ఆశలు పెరిగాయి. తీన్మార్ మల్లన్న సైతం ఎంపీ టిక్కెట్ ఆశించినప్పటికీ ఆయనకు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా అవకాశమిచ్చే ఆలోచనలో పార్టీ కీలక నేతలున్నట్లు తెలుస్తోంది. ఈ స్థానంలో టిక్కెట్ ఆశిస్తోన్న నేతలు ఎవరికి వారు తమ ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో అధిష్ఠానం ఎవరిని కరుణిస్తుందనే అంశంపై క్యాడర్‌లో ఆసక్తి నెలకొంది. గెలుపే లక్ష్యంగా ఏ సమీకరణాన్ని అధిష్ఠానం ఇక్కడ అమలు చేస్తుందో వేచి చూడాల్సి ఉందని కీలకనేతలు పేర్కొంటున్నారు.

ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసుంటే కరువొచ్చేది కాదు

● కేసీఆర్ పాలనలో ఉమ్మడి నల్లగొండ ప్రాజెక్టులకు తీవ్ర అన్యాయం ● కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుంది ● రోడ్లు భవనాల శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





కనగల్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, నల్లగొండలో అన్నపూర్ణ క్యాంటిన్‌ను ప్రారంభించి భోజనం వడ్డిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

కనగల్: ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేసి ఉంటే ఉమ్మడి జిల్లాకు ఈ కరువు వచ్చి ఉండేది కాదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులకు నిధులు కేటాయించలేదని, సొరంగం పనులు పూర్తయి ఉంటే నేడు జిల్లాకు కరువు వచ్చి ఉండేది కాదని అన్నారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మునిసిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కరీంపాష, జడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ ఎంపీటీసీ ఎర్రమాద యశోద, నాయకులు మందడి రాంచంద్రారెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, గోలినర్సిరెడ్డి, జగాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలన్నీ అమలుచేస్తాం

తిప్పర్తి: ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ప్రతీ ఒక్కటి పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం మార్కండేయస్వామి, మామిడాల గ్రామాల్లో ఉన్న శంభులింగేశ్వర స్వామి దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్నది ప్రజా ప్రభుత్వమని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ ఒక్కరు చిరునవ్వుతో ఉండాలనేదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి లింగారావు, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, నాయకులు ముత్తినేని శ్యాంసుందర్, అనూష నాగేశ్వర్‌రావు, బొల్లెద్దు నాగారాణి అంబేద్కర్, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, కొత్తపల్లి సిరివెన్నెల ఈదయ్య, పుల్లబట్ల ప్రవీణ్‌కుమార్, బద్దం సుధీర్, వనపర్తి అంజయ్య పాల్గొన్నారు.

యునెస్కో గుర్తింపు తెచ్చేందుకు కృషి

నల్లగొండ కల్చరల్, నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని పానగల్లులో గల పురాతనమైన ఛాయా సోమేశ్వరాలయానికి యునెస్కో గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంత్రి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయానికి చేరుకోగా, అర్చకులు వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయాన్ని దర్శించి, శివలింగానికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చారిత్రాత్మకమైన పానగల్లు శివాలయాలు ఎంతో ప్రసిద్ధి, ప్రాచుర్యం పొందాయని, అలాంటి ఆలయాలకు యునెస్కోలో గుర్తింపు కోసం సీఎం సహకారంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతిపాదనలు చేసే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. ఛాయా సోమేశ్వరాలయాన్ని ప్రపంచావ్యాప్తంగా, దేశవ్యాప్తంగా అనేక మంది ఆర్కియాలజీ నిపుణులు వచ్చి పరిశీలించాలరని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గంట్ల అనంతరరెడ్డి, వెంకట్‌లక్ష్మి, కౌన్సిలర్లు రజిత యాదయ్య, తిరుమల్‌రెడ్డి, ఆలకుంట్ల రాజేశ్వరి మోహన్‌బాబు, మహేశ్, అర్చకులు నవీన్‌శర్మ, ఉదయ్, అజయ్ పాల్గొన్నారు.

రూ. 326కోట్లతో అభివృద్ధి పనులు

నల్లగొండ పట్టణంలో రూ.326కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు వెనక పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. నల్లగొండ పట్టణంలో రూ.326కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నల్లగొండ చుట్టూ రూ.700 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి వచ్చే నెలలోనే టెండర్లు పిలువనున్నట్లు చెప్పారు. పట్టణంలోని ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల వద్ద, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో నిరుపేదలకు సబ్సిడీ భోజన పథకం అన్నపూర్ణ క్యాంటిన్లను ఈ సందర్భంగా ప్రారంభించారు.

జిల్లాలో జాతీయ రహదారులన్నింటినీ పూర్తి చేస్తాం

గుర్రంపోడు: జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణాలన్నీ సకాలంలో పూర్తి చేస్తామని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. గుర్రంపోడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సాగర్ నిర్మించి 75 సంవత్సరాలయినా చెక్కు చెదరలేదని, కాళేశ్వరం నిర్మించిన మూడేళ్లలో నాలుగు పిల్లర్లు కుంగిపోయాయన్నారు. కేటీఆర్‌కు నాలెడ్జ్ లేక పిల్లర్లకు రిపేర్ చేయాలంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య యాదవ్, జిల్లా నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చెనమల్ల జగదీశ్వర్‌రెడ్డి, గాలి రవి కుమార్, ఎంపీటీసీ కుప్ప రాములు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జాల చినసత్తయ్య యాదవ్, సయ్యద్ మియా పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల ఆక్రమణలపై విచారణ

- వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అస్మతుల్లా హుస్సేన్



మాట్లాడుతున్న అస్మతుల్లా హుస్సేన్

భువనగిరి టౌన్, మార్చి 8: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన వక్ఫ్ బోర్డు భూముల ఆక్రమణలు, పంపిణీలపై విచారణ జరుపుతామని వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అస్మతుల్లా హుస్సేన్ అన్నారు. శుక్రవారం వరంగల్ వెళుతూ మార్గమధ్యంలోని భువనగిరిలో తనను కలిసిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని, భూముల గుర్తింపునకు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే సహించబోమని, కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ అవేజ్ చిస్తి, నాయకులు ఎండీ సల్లాఉద్దీన్, ఎండీ అథర్, ఆబేద్ అలీ, అజాజ్, ఇంతియాజ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆమె'కు వందనం



నిడమనూరులో అంగన్‌వాడీ సిబ్బందిని సన్మానిస్తున్న స్థానికులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో తమదైన పాత్ర పోషిస్తున్న మహిళలను సన్మానించారు. మహిళల గొప్పతనాన్ని వక్తలు వివరించారు.

8

హెచ్‌పీవీ టీకాతో క్యాన్సర్‌కు చెక్



నార్కట్‌పల్లిలో ర్యాలీ తీస్తున్న కామినేని వైద్యవిద్యా కళాశాల మెడికోలు

నార్కట్‌పల్లి, మార్చి 8: మహిళల్లో గర్భకోశ సమస్యలతో వస్తున్న క్యాన్సర్ సమస్యకు హెచ్‌పీవీ టీకాతో చెక్ పెట్టవచ్చని కామినేని వైద్య విద్య కళాశాల ప్రిన్సిపల్ శృతీమహంతీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలేజీ మహిళా విద్యార్థులతో నార్కట్‌పల్లిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ ఎందుకు వస్తుందనే అంశంపై అవగాహన కల్పించారు. కొందరు స్త్రీలకు సర్వైకల్ క్యాన్సర్ వస్తుందని ఖచ్చితంగా చెప్పే అవకాశముందన్నారు. రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉండి చిన్నవయసులోనే వివాహం, సంభోగం వల్ల రావచ్చని చెప్పారు. కాగా సర్వైకల్ క్యాన్సర్‌పై మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేలా మెడికో విద్యార్థినులు చేసిన ప్రదర్శన అవగాహన కల్పించింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 300 మంది మహిళలకు హెచ్‌పీవీ టీకాను వేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నర్సిరెడ్డి, గైనకాలజీ హెచ్‌వోడీ సునీత, ఎస్‌పీఎం హెచ్‌వోడీ మారుతి శర్మ, పీఆర్‌వో కిరణ్ పాల్గొన్నారు.

11 నుంచి యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు



ముఖమండపంలోని ఆళ్వార్ విగ్రహాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట, మార్చి8: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు స్వయంభూ పాంచనారసింహుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించనున్నారు. ప్రధానాలయ ఉద్ఘాటన తర్వాత రెండో వార్షిక బ్రహ్మోత్సవాలు. ప్రతీ ఏడాదీ ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి ఫాల్గుణ శుద్ధ ఏకాదశి వరకు 11 రోజుల పాటు వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 17న స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం, 18న బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవం, 19న దివ్యవిమాన రథోత్సవ పర్వాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.ఈ నెల 11 నుంచి 21 వరకు కొనసాగనున్న వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11రోజుల పాటు స్వామివారి నిత్య, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేయనున్నారు.

నిత్య, మొక్కుకల్యాణాలు..సుదర్శన హోమ పూజల నిలివేత

యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలో ఈ నెల 11 నుంచి 21 వరకు కొనసాగనున్న వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11 రోజులపాటు స్వామివారి నిత్య, మొక్కుకల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేయనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ 11రోజులపాటు రాత్రివేళ నిత్యార్చనల అనంతరం రాత్రి 8.15గంటల నుంచి 9గంటల వరకు బలిహరణం, రాత్రి నివేదన జరుపుతారు. రాత్రివేళ 8గంటలకు అలంకార తిరువీధి సేవలు, సర్వదర్శనాలు ఆరంభించి రాత్రి 10గంటలకు శయనోత్సవ దర్శనం, ఆలయ ద్వారబంధనంగావిస్తారు. ఈ నెల 17 నుంచి 19 వరకు నిత్యార్చనలు, భోగములు, 20, 21వ తేదీల్లో భక్తులు జరిపించుకునే అభిషేకం, నిత్యార్చనలు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. కాగా స్వామి సన్నిధిలో మొక్కు సేవలు ఈ 11రోజుల పాటు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు.

అధికారుల సమీక్షలు.. సూచనలు

యాదాద్రీశుడు లక్ష్మీనృసింహుల వార్షిక వేడుకల కోసం అధికారులు ముందస్తుగానే ఏర్పాట్లు ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ పక్కా ప్రణాళికతో నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకనుగుణంగా అధికారులు అంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి సైతం ఇటీవల యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి ఉత్సవాల సమయంలో



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల నిఘాతోపాటు డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలకు పూజలు

యాదగిరీశుడి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలకు ప్రధానాలయంలో సంప్రదాయరీతితో అర్చకస్వాములు పూజలు నిర్వహించారు. ముందుగా గర్భాలయంలోని స్వయంభువుల వద్ద, అనంతరం ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద ఆహ్వాన పత్రికలకు ఆచార్యులు పూజలు నిర్వహించి అధికారులకు అందజేశారు. బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలకు పూజల నిర్వహించడం ఆలయ సంప్రదాయం.

పండుగ పూట విషాదం

- వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి
- మృతుల్లో తండ్రీకుమారుడు, ఓ బాలుడు ..

అర్వపల్లి, మిర్యాలగూడ అర్బన్, మార్చి 8: మహాశివరాత్రి పండుగ పర్వదినాన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా, రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృతుల్లో తండ్రీకుమారులు, బాలుడు ఉన్నారు. శుక్రవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన ఈ సంఘటనలు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అర్వపల్లి బొల్లంపల్లి గ్రామ శివారులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం మైదానంలో 15మంది క్రికెట్ ఆడుతున్నారు. గ్రామానికి చెందిన గద్దగూటి జానయ్య(38), కుమారుడు విఘ్నేష్(12)లు క్రికెట్ చూస్తున్నారు. అదే సమయంలో బొల్లపల్లి గ్రామానికి చెందిన క్రషర్ మిల్లు డ్రైవర్ శేఖర్ మద్యం మత్తులో టిప్పర్‌ను అతివేగంతో నడుపుతూ ఐకేపీ కేంద్రం మైదానంలోకి దూసుకువచ్చాడు. అక్కడ కూర్చుని క్రికెట్ చూస్తున్న జానయ్య టిప్పర్‌ను గమనించి పక్కనే ఉన్న కుమారుడు విఘ్నేష్‌ను కాపాడటానికి యత్నించినా ఫలితం లేకపోయింది. టిప్పర్ అతివేగంగా వచ్చి తండ్రీ కుమారులను ఢీకొట్టటంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. జానయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా, చిన్న కుమారుడు విఘ్నేష్ చివ్వెంల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో గురువారం ఇంటికి వచ్చి మృత్యువాత పడ్డాడు. టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని ఘటనా స్థలంలోనే వదిలేసి అక్కడినుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై జానయ్య భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌నాథ్ తెలిపారు.

వాహనం పైనుంచి పడి బాలుడి మృతి

వేగంగా వెళ్తున్న స్కూటీ అదుపు తప్పి కిందపడిపోయిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ రాములు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం మైసమ్మకుంటతండాకు చెందిన తేజావత్ రమేష్ కుమారులు లక్షణ్, ప్రభాస్(13) తాగునీటి కోసం స్కూటీపై వాటర్‌ట్యాంక్‌తండాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మైసమ్మకుంటతండా శివారులో వేగంగా వస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగా గాయపడిన సోదరులను స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్కూటీ నడుపుతున్న ప్రభాస్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో డాక్టర్ల సూచన మేరకు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. లక్మణ్ ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. బాలుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తపడాలని సీఐ వీరబాబు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొండమల్లేపల్లి, మార్చి 8: బైక్ అదుపు తప్పి తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదం కొండమల్లేపల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్రంపోడు మండలం తేనేపల్లి గ్రామానికి చెందిన రాసిక సునీత, లక్మయ్య దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రాసిక మణికంఠ(14) గుర్రంపోడులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. మణికంఠ గురువారం ద్విచక్రవాహనంపై నాంపల్లి మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలంలోని కొత్తబాయి గ్రామశివారులో బైక్ అదుపుతప్పి మిషన్ భగీరథ ట్యాంక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన మణికంఠను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుని తండ్రి లక్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.


సూర్యాపేటలో శివ లింగానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు


నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు




నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయంలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు




నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం

శంభో శివశంభో

ఉపవాస దీక్షతో ముక్కంటిని దర్శించుకున్న భక్తులు

ఉమ్మడి జిల్లాలో శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిలాల్లోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. నల్లగొండ జిల్లాలోని చాయా, పచ్చలసోమేశ్వరాలయం, దామరచర్ల మండలంలోని మీనాక్షీ అగస్తేశ్వరస్వామి ఆలయం, నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు జడల రామలింగేశ్వర క్షేత్రం, సూర్యాపేట జిల్లాలోని పిల్లలమర్రి ఆలయం, మేళ్లచెర్వులోని శివాలయం, యాదాద్రిభువనగిరి జిల్లాలోని యాదగిరిక్షేత్రంలోని శివాలయం, బీబీనగర్ మండలంలోని అక్కన్నమాదన్న ఆలయాలు, భువనగిరిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉపవాస దీక్షలో ఉన్నవారితో పాటు ఇతర భక్తులు ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.


సూర్యాపేటలో ..


బీబీనగర్‌లో శివపార్వతుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు


చౌటుప్పల్ పట్టణంలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


మర్రిగూడలో...


మిర్యాలగూడలో పూజల్లో పాల్గొన్న భక్తులు


నల్లగొండలో కల్యాణానికి హాజరైన భక్తులు

యాదగిరిక్షేత్రంలో శాస్త్రోక్తంగా మహాశివరాత్రి పర్వాలు

» రాత్రి లింగోద్భవ కాలంలో శతరుద్రాభిషేక పూజలు » బర్కత్‌పుర నుంచి అఖండ జ్యోతి యాత్ర ప్రారంభం

యాదగిరిగుట్ట, మార్చి 8: యాదగిరిక్షేత్రంలో కొండపైన అనుబంధ శివాలయంలో మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని విశేష పూజా పర్వాలు శైవాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. శివాలయ అర్చకబృందం, వేదపండితులు ఉదయం నిత్యవిధి పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా అభిషేక పూజలు కొనసాగగా భక్తులు కుటుంబసమేతంగా అభిషేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన పురోహితుడు సత్యనారాయణశర్మ శివరాత్రి మహత్యాన్ని భక్తులకు వివరించారు. రాత్రి వేళ లింగోద్భవ సమయంలో ఆలయ అర్చకులు, రుత్విక్కులు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేక పూజలను నిర్వహించారు.


గుట్ట శివాలయ మండపంలో స్ఫటికమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. గర్భగుడిలోని సువర్ణ ప్రతిష్ఠా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. గర్భాలయంలోని స్వయంభువులను వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలు, కుంకుమతో సహస్రనామార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,26,828 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. యాదగిరీశుడి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో ఆహ్వాన పత్రికతో పాటు అభిషేకం లడ్డూ ప్రసాదాలను ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిసి అందజేశారు.

వార్షిక ఉత్సవాలకు ఏర్పాట్లు: ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. హైదరాబాద్ బర్కత్‌పురలోని యాదగిరి భవన్ వద్ద అనువంశిక ధర్మకర్త బీ.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావులతో కలిసి సంప్రదాయరీతిలో అఖండ జ్యోతిని వెలిగించి యాత్రను ప్రారంభించారు. ముందుగా యాదగిరిగుట్ట దేవస్థాన ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకబృందం లక్ష్మీనృసింహుడిని కొలుస్తూ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యాత్ర హైదరాబాద్, బర్కత్‌పుర యాదగిరిభవన్ వద్ద ప్రారంభమై నాలుగు రోజుల పాటు ఉప్పల్, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, రాయగిరిల మీదుగా భక్తుల పూజలు అందుకుంటూ ఈ నెల 11న యాదగిరిగుట్ట పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు.

హర హర శంకర.. జయ జయ శంకర


» శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు » జాగరణ, ఉపవాస దీక్షలో భక్తులు » ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి కోమటి వెంకట్‌రెడ్డి, జిల్లా జడ్జి నాగరాజు

నల్లగొండ కల్చరల్, మార్చి 8 : హరహర మహదేవ.. శంభో శంకర.. అంటూ భక్తుల శివనామస్మరణతో శైవ క్షేత్రాలన్నీ మార్మోగాయి. భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని అభిషేకాలు, రుద్రాభిషేకం, లింగాభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్ర హోమాలు నిర్వహించారు. జిల్లా కేంద్ర సమీపంలోని పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తులు శివ పార్వతులకు అభిషేకాలు, రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు నవీన్ శర్మ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి.

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం, నార్కట్‌పల్లి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన ప్రత్యేక పూజల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు పాల్గొన్నారు.

దామరచర్ల: మండలంలోని శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వర, శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను దర్శించుకున్నారు. కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రదేశంలో నీళ్లు అడుగంటడంతో భక్తులు స్నానాలు చేసేందుకు ఆలయ సమీపంలోని షవర్స్‌ను ఏర్పాటు చేశారు. శ్రీ మీనాక్షి అగస్తేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూజలు నిర్వహించారు. పురాతన త్రిలింగేశ్వరాలయంలో పెద్ద ఎత్తున స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 6వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మేళ్లచెర్వు: మహాశివరాత్రి సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవకాల, మహాన్యాస పూర్వక, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభిషేకాలు ప్రారంభించాల్సి ఉండగా, ఢిల్లీ పర్యటనలో ఉండటంతో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి మహాజాతరను ప్రారంభించారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తెల్లవారుజామున రెండు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవం నిర్వహించారు.


నల్లగొండలో అభిషేకంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పిల్లలమర్రి దేవాలయంలో వేచి ఉన్న భక్తులు

నేరేడుచర్ల: ప్రాచీన సోమప్ప దేవాలయంలో ఉదయం 3గంటల నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాతలు తాగునీటి సరఫరా చేశారు.బారులుతీరి దర్శనం చేసుకున్నారు.

సూర్యాపేటరూరల్: పిల్లలమర్రి శివాలయాల్లో ఉదయం 4గంటల నుంచి మహన్యాస పూర్వక పూర్వక రుద్రాభిషేకం, ఎర్రకేశ్వరాలయం, త్రికూటేశ్వరం ఆలయాల్లో మధ్యాహ్నం 1-30 గంటలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహణ బసవముద్ద, రాత్రి 12-30 గంటలకు లింగోద్భవ కాలంలో దేవతామూర్తుల కళ్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు.

భువనగిరి టౌన్: భువనగిరిలోని శ్రీ పచ్చలకట్ట సోమేశ్వరాలయం, దక్షిణేశ్వరాలయం, శ్రీ భవానీ రామలింగేశ్వర ఆలయంతో పాటు పట్టణంలోని అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. శివపార్వతుల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

బీబీనగర్: మహాదేవ్‌పూర్ గ్రామంలోని అక్కన్న మాదన్న ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామి, రుక్మిణి సత్యభామ సతీసమేత శ్రీ వేణుగోపాల స్వామి, చిన్న రావులపల్లిలో కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేణుగోపాల స్వామి మండపంలో ఉత్సవాల తొలిరోజు అష్టోత్తర కలశాభిషేకం, ధ్వజారోహణం, హోమం కార్యక్రమాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. చిన్న రావులపల్లిలోని రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు.


దామరచర్ల : శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరాలయంలో పూజలు చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు


ఎమ్మెల్యే వీరేశానికి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేస్తున్న ఈఓ నవీన్‌కుమార్

హరహర మహదేవ.. శంభోశంకర.. ఓం నమఃశివాయా అంటూ భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలన్నీ మార్మోగాయి. ప్రసిద్ధమైన చారిత్రాత్మకమైన శైవ క్షేత్రా ల్లో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని అభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్ర హోమాలు నిర్వహించారు.


పచ్చల సోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, మర్రిగూడలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు






వాడపల్లిలో ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌కు అర్చకుల పూర్ణకుంభ స్వాగతం


తిప్పర్తి : రామలింగాలగూడెంలో పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి




పచ్చల సోమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


రామలింగాలగూడెం శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి


ఏలేశ్వరం కొండపై బారులు తీరిన భక్తులు


హాలియాలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భగత్


ఛాయా సోమేశ్వరాలయంలో భక్తులు

ఓం నమః శివాయ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జిల్లా కేంద్ర సమీపంలోని పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కోనేరులో పుణ్యస్నానాలను ఆచరించి భక్తులు జాగరణ చేశారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భం గా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా జడ్జి నాగరాజు, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా హాజరై శివలింగాన్ని దర్శించుకని అభిషేకాలు చేశారు. రాత్రి 8 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్బగోని ర మేష్, పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆలయ అభివృద్ధి కమి టీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, యానాల ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ బుర్రి రజిత యాదయ్య, రాజేశ్వరి మోహన్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు హరిబాబు, శేఖర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్‌శర్మ, కృష్ణమోహన్, వెంకట్, అర్చకులు పాల్గొన్నారు. వీటీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, నూకల జయపాల్‌రెడ్డి, గోపాలకృష్ణ, శ్యాంసుందర్, మేడం ప్రభాకర్, యాదగిరిరెడ్డి, సత్యనారాయణ, అర్చకులు పవన్‌శర్మ పాల్గొన్నారు. షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయంలో అర్చకులు కారంపూడి మోహనాచార్యులు, కౌన్సిలర్ ఎడ్ల గీత శ్రీనివాస్, సార మహేష్ పాల్గొన్నారు. తులసీనగర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలోని విశాలాక్షి సహిత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణ మ హోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● నార్కట్‌పల్లి చెర్వుగట్టు ఆలయంలో ఈవో నవీన్, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య, బండా సాగర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, రమేష్, గడుసు శశిధర్‌రెడ్డి, సత్తయ్య, అచ్చాలు పాల్గొన్నారు. అదేవిధంగా గోపలాయపల్లిలోని శివాలయంలో ఆలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ప్రత్యేకాభిషేకాలు, పూజల్లో పాల్గొన్నారు.నార్కట్‌పల్లిలోని పార్వతీ రామలింగేశ్వరాలయంలో చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

● దామరచర్ల మండల కేంద్రంలోని పురాతన త్రిలింగేశ్వరాలయ పునర్నిర్మాణానికి దామరచర్ల గ్రామానికి చెందిన పడిగపాటి శంభిరెడ్డి, మంగమ్మ దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. మండలంలోని వాడపల్లి గ్రామంలో కొలువైన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి సతీమణి సుమతి హాలియా మండలంలోని పేరూరు శివాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే భగత్ స్వామవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● దేవరకొండ మండలం కమలాపూర్ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవరకొండ ఖిల్లాపై ఉన్న శివాలయానికి భక్తులు వేలాదిగా చేరుకొని పూజలు చేశారు.

● చందంపేట మండలం దేవరచర్ల మునీశ్వర ఆలయంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పెద్దవూర మండలంలోని పిన్నవూర గ్రామంలో గల రామకోటేశ్వరస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి పూజలు నిర్వహించారు.

● నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న ఏలేశ్వరం మల్లిఖార్జునస్వామి కొండకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామి కాత్యాయిని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● మునుగోడులోని శ్రీశివరామక్షేత్రంలో గురువారం రాత్రి శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

● కనగల్ మండలంలోని పొనుగోడు గ్రామ జక్కన్నగుట్ట పార్వతిరామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో బాగంగా శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది.

పురాతన ఆలయాలను పరిరక్షించుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


ఛాయా సోమేశ్వరాలయంలోని శివలింగానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 8: పురాతన చారిత్రాత్మమైన శైవక్షేత్రాలను ప రిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎ మ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలోని పానగల్ ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలన్ని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకొని శివలింగానికి మహారుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఆలయాలకు పూర్వవైభవం సంతరించుకుందని అన్నారు. ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజున అంతర్జాతీయ మహిళా దినోత్సవం రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం తిప్పర్తి మండలం రామలింగాలగూడెంలోని మార్కండేయ స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భోనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, సందినేని జనార్థన్‌రావు, పెరిక యాదయ్య, రాములు, సందీప్‌రెడ్డి, లక్ష్మయ్య, జ్యోతి, నాగేశ్వర్‌రావు, గిరి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: సీపీఎం


ఎండిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నిడమనూరు, మార్చి 8: కరువు పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఎండిపోయిన పొలాలను శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎకరానికి రూ25 వేల వరకు పెట్టుబడులు పెట్టి రైతులు పంటలు సాగు చేశారని వాపోయారు. వర్షాలు లేకపోవడం, సాగునీరు విడుదల చేయకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కందుకూరి కోటేష్, ఆకారపు నరేష్, చంద్రశేఖర్, కుంచం శేఖర్, చరణ్‌రాజ్, బాలనారాయణ, వింజమూరి శివ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


దేవరకొండ: అధ్యాపకులను, విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం దేవరకొండ మండలం మైనంపల్లి ప్రభుత్వ మహిళ గిరిజన డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉపయోగపడే విధంగా ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకొని మహిళలు, విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, చందంపేట ఎంపీపీ పార్వతి, బుజ్జి, కొర్ర గౌతమిరాంసింగ్, వడ్త్య దేవేందర్‌నాయక్, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, హరికృష్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

● దేవరకొండలో వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీవనిత క్లబ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజయ, మంచికంటి పద్మ, కుంచకూరి శిరీష, జ్యోతి, రేణుక, రజిని, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండటౌన్: పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు డి.కళావతి అధ్యక్షతన 200మంది ఉపాధ్యాయిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్సీ పూల రవీందర్, జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు, డీటీవో సంపూర్ణ, డాక్టర్ కీర్తిరెడ్డి, ఎంఈవో అరుంధతి, మహిళా గెజిటెడ్ హెచ్‌ఎంలు అరుణశ్రీ, దేవపాల, హిమజ, వెంకటమ్మ, విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వనం పద్మ, సువర్ణ, రూపారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లో డివిజన్ మేనేజర్ సుశీల్‌కుమార్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో సంస్థ ఏజీఎం రాతీష్ చంద్రన్, తెలంగాణ ప్రాంత జనరల్ మేనేజర్ జీఎన్ రాజు, ఉద్యోగినులు కృష్ణవేణి, ఆశ, దివ్య, ప్రసన్న లక్ష్మి, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు: మండలంలోని ముకుందాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సీడీపీవో గందం పద్మావతి, సూపర్‌వైజర్ రాజేశ్వరి, టీచర్ అంబటి నాగమణిని ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుర్రం వెంకటేశం, కోటేష్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దివ్యారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సంగీతారెడ్డి, సర్వేయర్ స్వప్నలను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యాంసుందర్‌రెడ్డి, జేపీ శ్రీనివాస్‌యాదవ్, ఆర్‌పీ, సిబ్బంది పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలోని స్మార్ట్ కిండర్ స్టార్స్ ప్లే స్కూల్‌లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రసన్నజ్యోతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనితకుమారి, ఉపాధ్యాయులు విజయ, షాహినాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం పీహెచ్‌సీలోని మహిళా ఉద్యోగ సిబ్బందిని హెల్త్ అసిస్టెంట్లు మోలుగురి భాస్కర్, ఎర్ర వెంకటనారాయణ ఘనంగా సన్మానించారు. అనంతరం హస్పిటల్‌లో ఉన్న మహిళా పేషెంట్‌ను కూడా సన్మానించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

హాలియా: మహిళలు మానవాళి వెలుగులని ఎంపీపీ సుమతీపురుషోత్తం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుమతిపురుషోత్తం, హెల్త్ అసిస్టెంట్ గీతలను టీపీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్ ఆధ్వర్యంలో, అదే విధంగా హాలియా పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బందిలను సీఐ జనార్ధన్‌గౌడ్, ఎస్ఐ సతీష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ సుమతీపురుషోత్తం మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఆధునిక యుగంలో మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకొని అగ్రభాగాన నిలుస్తున్నారని ఇది ఎంతో శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారులు అవుల పురుషోత్తంయాదవ్, ఎమ్ఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు గార్లపాటి ప్రసాద్, షేక్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లిలో కేక్ కట్ చేస్తున్న మహిళలు



మహిళాదినోత్సవంగా సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు


నల్లగొండలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : బాలునాయక్

చందంపేట, మార్చి 8: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం చందంపేట మండలంలోని బొల్లా రంపట్టి, కంబాలపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఐదేళ్లలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అ భివృద్ధి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతిచందునాయక్, జడ్పీటీసీ బుజ్జిలచ్చిరాం, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

దేవరకొండ, మార్చి 8: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామదాసు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల రిటైర్డ్‌మెంట్ అనంతరం పింఛన్ సౌకర్యం లేక ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు ఉపేందర్, సురేందర్‌సింగ్, భూలక్ష్మీ, జ్యోతి, అలివేలు, మంగమ్మ, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

మాయావతి నిర్ణయం మేరకే పొత్తు

శాలిగౌరారం, మార్చి 8: బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి నిర్ణయం మేరకే బీఆర్ఎస్ పార్టీతో పొత్తు కుదుర్చుకున్నామని బీఎస్పీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు కిరణ్ స్పష్టం చేశారు. మండలంలోని ఆకారంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎస్పీ ఎప్పుడూ బహుజనుల పక్షమే ఉంటుందన్నారు. బీఎస్పీని పూర్తిగా భూస్థాపితం చేయాలని కాంగ్రెస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. బీఎస్పీ పోరాటం ఎన్నటికీ బహుజన ప్రజల భవిష్యత్తు, వారి ప్రయోజనాల కోసమే ఉంటుందని బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తును ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పొత్తు పెట్టుకోవడం అనేది కాన్షీరాం కాలం నుంచే ఉందని, బహుజన సిద్ధాంతం మీద అవగాహన లేని వారు విమర్శిస్తున్నారని అన్నారు.

నిజాయితీతో పనిచేస్తే తగిన గుర్తింపు

నల్లగొండ, మార్చి 8: వృత్తిలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తే శాఖాపరమైన గుర్తింపు ఉంటుందని ట్రాఫిక్ సీఐ ఆనంద్‌కుమార్ అన్నారు. నల్లగొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మన్నూరి సైదులుకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సైదులును ఆయన అభినందించారు. విధి నిర్వహణలో కష్టపడి పనిచేస్తే ఎంతో గౌరవం ఉంటుందని, శాఖాపరంగా ప్రోత్సాహం ఉంటుందని ఆయన తెలిపారు.

క్రికెట్ కిట్ పంపిణీ

తిరుమలగిరి(సాగర్), మార్చి 8: మండలంలోని రాజవరం గ్రామ యువతకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సహకారంతో వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి శుక్రవారం క్రికెట్ కిట్‌ను అందచేశారు. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ యువత అన్నిరంగాల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, తిరుమలనాథ ఆలయ మాజీ చైర్మన్ బుర్రి రాం రెడ్డి, నారాయణరెడ్డి, సజ్జన్, యువకులు మల్లిఖార్జున్, నజీర్, ప్రవీణ్, అంజిబాబు, బ్రహ్మరాజు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

అడవిదేవులపల్లి, మార్చి 8: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అడవిదేవులపల్లి మండలకేంద్రంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురారం మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన సపావత్ బాలునాయక్, తన భార్య సాలి, ధనావత్ శ్రీను, పానుగోతు లాలిలు మహా శివరాత్రి సందర్భంగా అడవిదేవులపల్లిలోని బౌద్ధమగుళ్లను దర్శించుకున్నారు. తిరిగి ఆటోలో ఇంటికి వెళ్తుండగా మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద కుక్క అడ్డం వచ్చింది. డ్రైవర్ దానిని తప్పించబోవడంతో అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బాలు, సాలికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని మిర్యాలగూడ పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయాలైన వారు తిరిగి తమ ఇంటికి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

వృత్తి డ్రైవింగ్.. ప్రవృత్తి చైన్‌స్నాచింగ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 8: డ్రైవర్లుగా పని చేస్తున్న ఇద్దరు యు వకులు తమకు వస్తున్న ఆదాయం సరిపోక ఆభరణాల దొంగతనాన్ని ఎంచుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం వారిని అరెస్టు చేసి రూ.2.20లక్షల విలువైన సొత్తు రికవరీ చేశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దవూర మండలం పెద్దగూడెం కు చెందిన జింకల నాగరాజు, తిప్పర్తి మండలం గంగన్నపాలెంకు చెందిన ఈద సతీష్ వరుసకు బావబావమరుదులు అవుతారు. కారు డ్రైవర్లుగా పనిచేసే వీరిద్దరూ తేలికగా డబ్బు సంపాదించేందుకు బంగారు ఆభరణాల ను కాజేసేందుకు నిర్ణయించుకున్నారు. ఫిబ్రవరి 3న పెద్దగూడెంలో కూన్‌రెడ్డి పిచ్చమ్మ వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా నిందితులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహి స్తుండగా, పెద్దవూర జైజంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో యువకులు పట్టుబడ్డారు. నాగరాజు, సతీష్‌లను విచారించగా గతంలో చేసిన చైన్‌స్నాచింగ్ ఘటనలను అంగీకరించినట్లు తెలిపారు. జనవరిలో నకిరేకల్ శివారులో పశువుల కాపరిగా వెళ్లిన వృద్ధురాలి వద్ద రూ.40 వేల విలువైన బంగారు గొలుసు, ఫిబ్రవరిలో నకిరేకల్ మండలం వెలమగూడెంలో మరో మహిళ మెడలోని రూ.35వేల విలువైన బంగారం గొలుసు, పెద్దగూడెంలో మహిళ మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు అపహరించుకెళ్లినట్లుగా అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. వారినుంచి రూ.2.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. చైన్‌స్నాచింగ్ కేసుల మిస్టరీని చేదించిన సాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్, పోలీస్ సిబ్బంది ఆనందయోగి, కోటయ్య, కిషన్, మట్టయ్య, రాజు, జావిద్, రవి, నాగరాజు, మధు, రాంబాబు, వెంకటరామిరెడ్డి డీఎస్పీ అభినందించారు.